క్లుప్తంగా

4, 5 తేదీల్లో గంధ మహోత్సవం

చేజర్ల (సోమశిల): ఈ నెల 4, 5 తేదీల్లో అనంతసాగరం మండలం సోమశిలలో హజరత్ మౌలాలి 15వ గంధ మహోత్సవం జరుగుతుందని నిర్వాహకులు సయ్యద్ శోభ, సయ్యద్ అబ్దుల్ రహమాన్ మంగళవారం తెలిపారు. మసీదును రంగులతో ముస్తాబు చేశారు. 5వ తేదీ జరిగే గంధ మహోత్సవానికి భక్తులందరు హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

వెలుగు సిబ్బందికి శిక్షణ

ఆత్మకూరు: పట్టణంలోని వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో వెలుగు సీసీలు, ఇతర సిబ్బందికి లోకోస్ యాప్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఎంపిక చేసిన సీసీలు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఏసీ వెంకటేశ్వర్లు వీరికి శిక్షణ ఇచ్చారు. దేశ వ్యాప్తంగా పొదుపు గ్రూపుల వివరాలను ఒకే యాప్‌లో నమోదు చేసేలా ఈ యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. మహిళల పొదుపు నిర్వహణ, బ్యాంకు రుణాలు, రికవరీలు, తొలగింపబడిన వారి పేర్లు, తదితర పూర్తి వివరాలు ఈ యాప్‌లో నమోదు చేయాలని సీసీలకు సూచించారు. ఏరియా కో–ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, ఏపీఎం పి.వెంకమ్మ, పొదుపు సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయంలో ఎంపీడీఓ ఆకస్మిక తనిఖీ



నువ్వూరుపాడు సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

ఆత్మకూరురూరల్: మండలంలోని నువ్వూరుపాడు సచివాలయాన్ని ఆత్మకూరు ఎంపీడీఓ శ్రీనివాసులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా బయోమెట్రిక్ పద్ధతిలో వేయాలని, ఈ విషయంలో ఎవరికి మినహాయింపులేదన్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి అందిన అర్జీలను రిజిస్టర్‌లో నమోదు చేసి, ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. పంచాయతీ కార్యదర్శి ప్రసన్నలక్ష్మి, వీఆర్‌ఓ మాల్యాద్రి, సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు తాగునీటికి అంతరాయం

ఆత్మకూరు: ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో తాగునీరు సరఫరా చేసే పైప్‌లైన్ సోమశిల రోడ్డు మార్గంలో ఓ కారు ప్రమాదానికి పగిలిందని, దీంతో బుధవారం నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ జె.ప్రసాద్ మంగళవారం తెలిపారు. బుధవారం మరమ్మతులు పూర్తిచేసి నీటి సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

వాహనాల తనిఖీకి స్పెషల్ డ్రైవ్




వాహనాలు తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్సై

ఆత్మకూరు: పట్టణంలో ఎస్సై ఎం.శివశంకర్‌రావు మంగళవారం వాహనాల తనిఖీకి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. నెల్లూరుపాళెం, నెల్లూరు–ముంబయి రహదారి, బైపాస్‌రోడ్డు, సోమశిల రోడ్ సెంటర్ ప్రాంతాల్లో ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు తమ వాహనాల లైసెన్సులను తమ వెంట తప్పని సరిగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. హెల్మెట్ లేకుండా డ్రైవ్ చేస్తే ద్విచక్ర వాహనదారులకు జరిమానా విధిస్తామన్నారు.

పెన్షన్‌దారులు ఈకేవైసీ చేయించుకోవాలి

ఆత్మకూరు: ఆత్మకూరు ప్రభుత్వ ఖజానా పరిధిలోని ప్రభుత్వ పెన్షన్‌దారులు ఈ నెల 6వ తేదీలోపు ఈకేవైసీ (సీఎఫ్‌ఎంఎస్‌కు ఆధార్ లింక్ చేయడం) తప్పనిసరిగా చేయించాలని ఉప ఖజానాధికారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సంవత్సరం పెన్షన్‌దారులు అందజేసే లైఫ్ సర్టిఫికెట్ ఏప్రిల్‌లో అందజేయకపోవడంతో కొందరికి పెన్షన్లు నిలిచిపోయాయన్నారు. అటువంటి వారు వెంటనే మ్యాన్యువల్ పద్ధతిలో లైఫ్ సర్టిఫికెట్లు అందజేస్తే ఈ నెల పెన్షన్ అందుతుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని పెన్షన్‌దారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బైక్ అదుపు తప్పి యువకుడికి తీవ్ర గాయాలు



ఆత్మకూరు: బైక్‌పై వస్తున్న యువకుడు అదుపుతప్పి పడటంతో తీవ్ర గాయాలు పాలైన ఘటన పట్టణంలో మంగళవారం రాత్రి జరిగింది. ఎస్సై ఎం.శివశంకర్‌రావు సమాచారం మేరకు ఆత్మకూరు పట్టణానికి చెందిన రోహిత్ అనే యువకుడు నెల్లూరు నుంచి బైక్‌పై వస్తుండగా టిడ్కో భవనాల వద్ద బైక్ అదుపుతప్పి పడింది. ఈ ఘటనలో తీవ్రగాయాల పాలైన రోహిత్‌ను పోలీసులు స్థానికంగా ఉన్న ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించారు. యువకుడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

- అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- నిర్లక్ష్యానికి తావులేకుండా వ్యవహరించాలి
- కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

బిట్రగుంట: గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అభివృద్ధి పనులపై వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులు, ప్రతిపాదనలపై క్షుణ్ణంగా చర్చించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు పంపిణీ చేయాలని సూచించారు. కాలనీల్లో నిర్మాణాలకు ఎటువంటి సహాయం అవసరం అయినా వెంటనే తనకు సమాచారం అందించాలన్నారు. సచివాలయాల వారీగా అపరిష్కృతంగా ఉన్న దరఖాస్తులు, లబ్ధిదారులకు పథకాలు అందించడంలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలపై చర్చించారు. సమస్యలు సాధ్యమైనంత త్వరితగతిన పరిష్కరించి లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజలు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై కూడా సమీక్షించారు. ఆయా సమస్యల పరిష్కారంపై సంబంధితశాఖల అధికారులకు సూచనలు చేశారు. నాడు–నేడు పనులు కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అవసరం అయితే స్థానిక నేతల సహకారంతో పనులు శరవేగంగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హేమంత్, వివిధ శాఖల అధికారులు, నాగులవరం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు మద్దిబోయిన వీరరఘు పాల్గొన్నారు.

వైభవంగా అలఘునాథుడి గ్రామోత్సవం



గరుడ వాహనంపై అలఘునాథస్వామి గ్రామోత్సవం

ఆత్మకూరు: పట్టణంలోని తూర్పువీధిలో కొలువైన ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత అలఘునాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం గరుడ వాహనంపై దేవదేవేరుల గ్రామోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. దేవతామూర్తులను విశేష పుష్పాలతో గరుడ వాహనంపై ఆకర్షణీయంగా అలంకరించారు. అనంతరం మేళతాళాలు, భాజాభజంత్రీలు, బాణసంచా వేడుకల నడుమ గ్రామోత్సవం సాగింది. ఊరేగింపులో ముందు ఆర్యవైశ్య మహిళలు కోలాటం, బ్రాహ్మణపల్లికి చెందిన బాలికల శ్రీనివాస నృత్యరూపకం, కోలాటం, ఉత్సవంలో ఆకర్షణగా నిలిచింది. దారిపొడవునా భక్తులకు ఆలయ నిర్వాహకులు ప్రసాదాలు పంపిణీ చేశారు.

జగనన్న సంక్షేమ పథకాలతో ఆర్థిక పరిపుష్టి



కొత్తపాలెంలో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్న మూల వెంకటరమణారెడ్డి

జలదంకి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో పేద కుటుంబాలు ఆర్థిక పరిపుష్టి చెందుతున్నాయని, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ మూల వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కొత్తపాళెం, ఎస్సీ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ ఫలాలను, చేస్తున్న సేవలను ప్రజలకు వివరించారు. తాను ఉదయగిరి నియోజకవర్గంలోని ఏ పల్లెకు వెళ్లినా ప్రజారంజక పాలన అందిస్తున్న జగన్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసుకోవాలని ప్రజలు తమ అభీష్టాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. యువత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గడపకూ తీసుకెళ్లాలని కోరారు.

వృత్తి, విద్య కోర్సులతో ఉద్యోగావకాశాలు



విద్యార్థులకు కంపెనీ నియామక పత్రం అందిస్తు అభినందిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి రూరల్: రాష్ట్రంలో భారీగా పరిశ్రమలు నెలకొల్పుతుండడంతో వృత్తి విద్య కోర్సుల్లో నైపుణ్యం కలిగిన యువతకు ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రుద్రకోటలో ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం ఉద్యోగ విజయోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 10వ తరగతి పూర్తయిన విద్యార్థులు వృత్తి విద్య కోర్సుల ద్వారా ఉత్తీర్ణత సాధించి వెంటనే ఉపాధి పొందేందుకు పాలిటెక్నిక్ కళాశాల ఒక వేదిక అన్నారు. ఎందరో విద్యార్థులు తమకు నచ్చిన కోర్సును ఎంచుకుని అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కళాశాల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పాలిటెక్నిక్ కళాశాల ద్వారా ఉద్యోగాలు పొందిన యువతకు కంపెనీ నియామక పత్రాలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సుశీల్‌కుమార్ ప్రియా, ట్రాన్స్‌కో ఏడీఏ భానునాయక్, ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్, జెడ్పీటీసీ జంపాని రాఘవులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రహదారి నిబంధనలపై అవగాహన అవసరం

– ఎంవీఐ రాములు



రోడ్డు భద్రత నిబంధనలపై విద్యార్థులకు సూచనలు చేస్తున్న ఎంవీఐ రాములు

ఆత్మకూరు: విద్యార్థులు రోడ్డు నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని ఆత్మకూరు మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ పి.రాములు సూచించారు. వాహనాలను డ్రైవ్ చేసేటప్పుడు నిబంధనలు పాటించకపోతే ప్రమాదాలు జరగడంతో పాటు కేసులు నమోదయితే శిక్షలు, జరిమానాలు తప్పవని చెప్పారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపరాదని సూచించారు. ఇయర్ ఫోన్లు సైతం ఉపయోగిస్తూ వాహనాలు నడపరాదన్నారు. ద్విచక్ర వాహనాలపై ముగ్గురు ప్రయాణం చేయరాదన్నారు. మద్యం తాగి వాహనాలు నడపకూడదని హెచ్చరించారు. వాహనచోదకులు తమపై ఆధారపడిన కుటుంబ సభ్యులను దృష్టిలో ఉంచుకుని వాహనాలను నడపాలన్నారు. ప్రిన్సి పల్, అధ్యాపకులు, రవాణాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

92.53 శాతం పింఛన్ల పంపిణీ



నెల్లూరులో చికిత్స పొందుతున్న అందే లింగమ్మకు పింఛన్ అందిస్తున్న మురగళ్ల వలంటీరు శ్రీకాంత్

ఆత్మకూరురూరల్: మండలంలోని 11 సచివాలయాల పరిధిలో ప్రభుత్వం అందజేస్తున్న సామాజిక పింఛన్ల పంపిణీ మంగళవారం నాటికి 92.53 శాతం పంపిణీ పూర్తయిందని ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. రామస్వామిపల్లి, బోయలచిరివెళ్ల, అప్పారావుపాళెం, మహిమలూరు, బట్టేపాడు, నువ్వూరుపాడు, చెర్లోయడవల్లి, వాశిలి, మురగళ్ల, కరటంపాడు, వెన్నవాడ సచివాలయాల పరిధిలో 4,910 మంది లబ్ధిదారులకు 4,544 మందికి రూ.1,25,81,500 పింఛన్ల సొమ్ము వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చేశామన్నారు.

గిరిజన సంఘాల జేఏసీ చైర్మన్‌కు సన్మానం



దేవరకొండ సుధీర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

కావలి: ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్‌గా నూతనంగా ఎన్నికైన దేవరకొండ సుధీర్‌ను గిరిజన సంఘాల ప్రతినిధులు మంగళవారం ఘనంగా సన్మానించారు. వెంగళరావునగర్‌లోని గిరిజన సంఘాల ఐక్యవేదిక కార్యాలయంలో ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పాలకీర్తి రవి ఆధ్వర్యంలో దేవరకొండ సుధీర్‌ను ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు సముద్రాల దావీదు, గిరిజన సంఘాల జేఏసీ నాయకులు మేలింగి పాలు, గున్నం రాహుల్, వావిళ్ల బాలాజీ, కావలి మహేష్ పాల్గొన్నారు.

1,624 పొగాకు బేళ్ల కొనుగోలు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): డీసీపల్లి వేలం కేంద్రానికి మంగళవారం 1,029 పొగాకు బేళ్లను రైతులు తీసుకురాగా 985 బేళ్లను కొనుగోలు చేశారని వేలం నిర్వహణ అధికారి జి.రాజశేఖర్ తెలిపారు. మొత్తం 1,21,774 కిలోల పొగాకు అమ్ముడుకాగా రూ.2.35 కోట్ల వ్యాపారం జరిగింది. కిలోకు గరిష్ఠంగా రూ.200, కనిష్ఠంగా రూ.175 ధర లభించింది. 10 కంపెనీలు వేలంలో పాల్గొన్నాయి.

- కలిగిరి: కలిగిరి పొగాకు వేలం కేంద్రానికి మంగళవారం జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 698 బేళ్లను అమ్మకానికి తీసుకురాగా 669 బేళ్లను కొనుగోలు చేశారని వేలం నిర్వహణాధికారి మహేష్ కుమార్ తెలిపారు. కిలో పొగాకుకు గరిష్ఠంగా రూ.200, కనిష్ఠంగా రూ.160, సగటున రూ.196.93 ధర లభించింది.

నేటి నుంచి గడపగడపకు మన ప్రభుత్వం

మర్రిపాడు (ఆత్మకూరురూరల్): బుధవారం నుంచి 8వ తేదీ వరకు మర్రిపాడు మండలంలోని పలు గ్రామాల్లో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 3, 4 తేదీల్లో పల్లవోలు, తిక్కవరం, 5న సింగనపల్లి, 6న అల్లంపాడు సచివాలయం పరిధిలోని ఖాదర్‌పూర్‌లో, 7, 8 తేదీల్లో పడమటినాయుడుపల్లి సచివాలయం పరిధిలో గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 4.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని ప్రజాప్రతినిధులు, సచివాలయ కో–ఆర్డినేటర్లు, కన్వీనర్లు, సంబంధిత శాఖల అధికారులు, గృహసారథులు ఆయా గ్రామాల్లో జరిగే కార్యక్రమాలకు హాజరు కావాలని కోరారు.

సచివాలయాల్లో ఎంపీడీఓ తనిఖీలు



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీడీఓ

చేజర్ల(సోమశిల): అనంతసాగరం మండలంలోని పలు సచివాలయాలను ఎంపీడీఓ ఏ మధుసూదన్‌రావు మంగళవారం తనిఖీ చేశారు. సోమశిల, ఉప్పలపాడు సచివాలయాలను ఆయన పరిశీలించి సిబ్బంది, వలంటీర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమయపాలన పాటించాలని సూచించారు. నాడు–నేడు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భూముల రీ సర్వే పరిశీలన



రీ సర్వే పనులను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్

చేజర్ల: మండలంలోని ఏటూరులో భూముల రీ సర్వేను ట్రైనీ కలెక్టర్ ఏ మహేష్ మంగళవారం పరిశీలించారు. భూముల సర్వేను కచ్చితంగా ఉండేటట్లు చేయాలని సిబ్బందికి సూచించారు. విలేజ్ సర్వేయర్ ట్రైనింగ్‌లో భాగంగా శిక్షణ కోసం ఆయన చేజర్ల మండలంలో నియమించారు. రెవెన్యూసిబ్బంది పాల్గొన్నారు.


ఘనంగా పోలేరమ్మకు పొంగళ్లు



ఊరేగింపుగా తీసుకెళుతున్న పొంగళ్లు

కొండాపురం: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన అనంతరం మూడో రోజు మంగళవారం గ్రామదేవత పోలేరమ్మ తల్లి పొంగళ్ల కార్యక్రమాన్ని మఠాధిపతి కంచర్ల కేశవాచారి ఆధ్వర్యంలో జరిగాయి. పొంగళ్ల అనంతరం గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా గ్రామ చివరలో ఉన్న పోలేరమ్మ ఆలయం వద్దకు మేళతాళాలు, డప్పుల మధ్య గ్రామంలోని పొంగళ్ల గంపను నెత్తిన పెట్టుకుని వెళ్లి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

విద్యార్థులకు అభినందనలు



ఉదయగిరి: స్థానిక ఆల్తూరి రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులను మంగళవారం ప్రిన్సిపల్ ఎస్.కిరణ్ అభినందించారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో అబ్దుల్‌అలి, అప్సాన, లావణ్య, ఆస్మ, ప్రసాద్, అనంతలక్ష్మి ఉత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు.

లక్ష్మీనరసింహుని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



ప్రత్యేకలంకరణతో అమ్మవార్లతో శ్రీవారు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం నల్లగొండ్ల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో మంగళవారం బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. దేవస్థానాన్ని, కొండను ప్రత్యేక విద్యుద్దీపాలంకరణ చేశారు. మేళతాళాల నడుమ వేదపండితులు పుట్టమట్టిని ఆలయానికి తీసుకొచ్చి నవధాన్యాలు చల్లి ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. కల్యాణ మండపం నుంచి ఊరేగింపుగా ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కొండపైకి చేర్చారు. అంకురార్పణకు ఉభయకర్తలుగా అంకినపల్లి ఓబుల్‌రెడ్డి, శివశంకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. బుధవారం ధ్వజారోహణం, శేషవాహన సేవ నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ధర్మకర్త అన్నపురెడ్డి మోహన్‌రెడ్డి తెలిపారు.

5న కావలిలో మెగా మెడికల్ క్యాంప్

కావలి: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో దివంగత మాజీ మంత్రి కలికి యానాదిరెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 5న మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు ఆయన అభిమానులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో నెల్లూరు మెడికవర్ ఆస్పత్రి సౌజన్యంతో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రముఖ గుండె వైద్యనిపుణులు డాక్టర్ కే రాంప్రసాద్, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ ఫిరోజ్, ఎముకలు, కీళ్ల వ్యాధి నిపుణులు డాక్టర్ కే శశిధర్ రెడ్డి, ఫ్యామిలీ మెడిసిన్ వైద్య నిపుణులు డాక్టర్ కే చంద్రశేఖర్ తదితరులు వైద్య సేవలందిస్తారన్నారు. ఎల్వీప్రసాద్ కంటి ఆస్పత్రి సౌజన్యంతో ప్రత్యేక నేత్ర వైద్యశిబిరం కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిబిరంలో ఉచితంగా కంటి వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శస్త్ర చికిత్సలు, కంటి అద్దాలు కూడా పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. స్థానికులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హైరిస్క్ గర్భిణుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అనుమసముద్రంపేట: హైరిస్క్ ఉన్న గర్భిణులను గుర్తించడం, వారికి ప్రత్యేకంగా అవగాహన కల్పించడం, వారికి కాన్పు అయ్యేంత వరకు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఏఎస్‌పేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి మంజులమ్మ తెలిపారు. పీహెచ్‌సీ ఆవరణలో మంగళవారం ఆశ వలంటీర్ల సమావేశం నిర్వహించారు. ఎన్‌సీడీ కార్డులు, సాధారణ కాన్పులపై దృష్టి పెట్టాలన్నారు. వైద్యాధికారి సురేష్‌బాబు మాట్లాడుతూ ఏఎన్‌ఎంలు ఆశ వలంటీర్లు ఎంఎల్‌హెచ్‌పీ సిబ్బంది రోజు జరిగే ఫ్యామిలీ కాన్సెప్ట్ ప్రొగ్రాంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ముందుగానే ప్రిపరేషన్ చేసుకోవాలన్నారు. ఇటీవల ఏఎస్‌పేటలో హైరిస్క్ గర్భిణిపై ప్రత్యేక శ్రద్ధ చూపించిన సీహెచ్‌ఓ దేవసేనమ్మ, ఏఎన్‌ఎం శాంతికుమారి, ఎంఎల్‌హెచ్‌పీ రహమతున్నీసా, ఆశ వలంటీర్ రమణమ్మలకు ప్రత్యేక బహుమతులను అందజేశారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన చేపట్టాలి

ఉదయగిరి: మండలంలో జగనన్న ఇంటి నివాస స్థలాలు పొందిన లబ్ధిదారులు వెంటనే ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు. ఆయన మంగళవారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 28 లేఅవుట్లలో 953 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారన్నారు. వీరందరికీ ఇళ్లు మంజూరైనట్లు చెప్పారు. వీరు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలని కోరారు. అనంతరం ఉదయగిరి–3 సచివాలయాన్ని తనిఖీ చేసి రికార్డులు పరిశీలించి సిబ్బంది బయోమెట్రిక్ హాజరును పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఖాదర్ కరిముల్లా ఉన్నారు.

పంట ధ్వంసం చేశారని ఫిర్యాదు

జలదంకి: తాను సాగు చేస్తున్న కూరగాయల పంటను కాయలు, పిందెలతో సహా అర్ధరాత్రి వేళ కాలేషా అతని సోదరులు ధ్వంసం చేశారని జలదంకికి చెందిన పల్లాను దొరసానమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి సమాచారం మేరకు.. జలదంకికి చెందిన కోర్సిపాటి వెంకటరమణారెడ్డికి చెందిన పొలాన్ని దొరసానమ్మ కౌలుకు తీసుకుని సాగు చేసుకుంటోంది. ఆ పొలానికి సంబంధించి వెంకటరమణారెడ్డికి న్యాయస్థానం ఇంజంక్షన్ ఆర్డర్‌తో పాటు డిక్రీ కూడా ఇచ్చి ఉంది. అయితే రెండు రోజుల క్రితం కాలేషా అతని సోదరులు పంటను ధ్వంసం చేశారని, అడిగితే నిర్లక్ష్యంగా మాట్లాడారని తెలిపింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశానని, పోలీసులు విచారించి న్యాయం చేయాలని కోరింది.

చేపల గుంతల ఏర్పాటును అడ్డుకున్న రైతులు



ప్రొక్లయినర్‌ను అడ్డుకున్న రైతులు

సంగం: మండలంలోని తరుణవాయి పంచాయతీలో ఓ రైతు ఏర్పాటు చేస్తున్న చేపల గుంతలను పక్క పొలాల రైతులు అడ్డుకున్నారు. పనులు జరగకుండా ప్రొక్లయినర్‌కు అడ్డంగా నిలబడి అడ్డుకున్నారు. చేపల గుంతల వల్ల తమ పంట పొలాలు దెబ్బతింటాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి చేపల గుంతలు వేయకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఘనంగా రాములోరి ఉత్సవాలు



గజవాహనాన్ని దేవస్థానానికి ఊరేగింపుగా తీసుకెళుతున్న ఉభయకర్తలు

వింజమూరు (ఉదయగి): మండలంలోని రావిపాడులో కోదండరామస్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం కల్యాణోత్సవం నేత్రపర్వంగా చేపట్టారు. దేవస్థానానికి కొండపల్లి సురేష్ దంపతులు పంచలోహ గజవాహనాన్ని అందజేశారు. ఉత్సవాలకు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు.

వలంటీర్లకు కిట్‌ల పంపిణీ



అల్లూరు: మండలంలో ఆపదమిత్ర ట్రైనింగ్ పొందిన వలంటీర్లు, ఆశ కార్యకర్తలకు స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ శ్రీదేవి, ఎంపీపీ శశిరేఖ కిట్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, గుమ్మడి సురేంద్ర, ఉస్మాన్ షరీఫ్, నరసింహారావు, సుధా, శీనయ్య పాల్గొన్నారు.

స. హ. చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

కావలి రూరల్: సమాజంలో ప్రభుత్వాలు సమాచార హక్కు చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని లోక్‌సత్తా ఉద్యమ రాష్ట్ర కమిటీ సభ్యులు మాలకొండారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాలన సమాచారం ప్రజల ప్రాథమిక హక్కు పోరాడి సాధించుకున్న సమాచార హక్కు చట్టానికి 17 ఏళ్లు పూర్తయిందన్నారు. 2005వ సంవత్సరంలో అప్పటి యూపీఏ ప్రభుత్వం ఈ చట్టాన్ని తీసుకువచ్చిందన్నారు. ఈ చట్టం ద్వారా పరిపాలనలో అవినీతి నిర్మూలించి, పాలనలో పారదర్శకం ఏర్పడి ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయన్నారు.

లోకోస్ యాప్‌పై అవగాహన

ఉదయగిరి: స్థానిక స్త్రీశక్తి భవనంలో మంగళవారం మండలంలోని వీఏఓలకు లోకోస్ యాప్‌పై ఏపీఎంలు ఖాజారంతుల్లా, కాంతారావు అవగాహన కల్పించారు. ఈ యాప్‌లో పొదుపు సభ్యుల వివరాలను వీఏఓలు నమోదు ఏ విధంగా చేయాలనే విధానంపై వివరించారు.

అంగన్‌వాడీ సహాయకుల ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

కలిగిరి: అంగన్‌వాడీ సహాయకుల ఖాళీల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఐసీడీఎస్ వింజమూరు ప్రాజెక్ట్ సీడీపీఓ సీహెచ్ పద్మజాకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వింజమూరు ప్రాజెక్ట్ పరిధిలోని కలిగిరి మండలం వీర్నకొల్లు (ఓసీ), వింజమూరు మండలం ఏ. కిస్తీపురం (ఓసీ), కొండాపురం మండలం కొండాపురం హెచ్‌డబ్ల్యూ (ఎస్సీ), జలదంకి మండలం చౌడవరం మెయిన్ (ఓసీ), ఆదిరెడ్డిపాళెం మెయిన్ (ఓసీ), గమళ్లపాళెం బీసీకాలనీ (బీసీ) అంగన్‌వాడీ కేంద్రాల్లో సహాయకుల పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 10వ తరగతి పాస్ అయిన వారు ఈ నెల 9వ తేదీలోపు గ్రామ సచివాలయాల్లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ఆత్మకూరు సెక్టార్ పరిధిలో..

ఆత్మకూరు: ఆత్మకూరు సెక్టార్ పరిధిలో 4 అంగన్‌వాడీ హెల్పర్ల ఖాళీలు ఉన్నాయని వాటికి దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ జైనకుమారి మంగళవారం తెలిపారు. బుధవారం నుంచి 9వ తేదీలోపు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. 21 నుంచి 35 ఏళ్లలోపు వారు, పదో తరగతి పాసైన వారు, స్థానిక మహిళలు దరఖాస్తు చేసుకోచ్చన్నారు. పూర్తి చేసిన దరఖాస్తు ఫారాలను పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానం

ఉదయగిరి: ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకురాళ్ల పోస్టుల భర్తీకి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు సీడీపీఓ పచ్చవ లావణ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దుత్తలూరు మండలం భైరవరం మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్త (ఓసీ), నర్రవాడ వడ్డిపాళెం (ఓసీ), ఉదయగిరి మండలం బిజ్జంపల్లి (బీసీ–ఈ), వరికుంటపాడు మండలం తిమ్మారెడ్డిపల్లి మెయిన్ (ఓసీ), అంగన్‌వాడీ కేంద్రాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. బుధవారం నుంచి ఈ నెల 9వ తేదీ వరకు ఆయా సచివాలయాల్లో అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.